మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలి : జడ్పీ సిఇవో ఎల్లయ్య



ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 18, (ప్రభాతవార్త):** గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య తెలిపారు. గురువారం చిన్నశంకరంపేటలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఎంపీవో గిరిజా రాణిలు ఉన్నారు.

## కాసాల గ్రామ పరిధిలో సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు

**హత్నూర, సెప్టెంబరు 18, (ప్రభాతవార్త):** హత్నూర మండలం కాసాల రెవెన్యూ గ్రామపరిధిలోని సర్వే నంబర్ 324లో భూమి హెచ్చుతగ్గులపై వచ్చిన ఫిర్యాదులను పురస్కరించుకొని గురువారం హత్నూర రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. 324 సర్వే నంబర్లు మొత్తం 20 ఎకరాల మూడు గుంటల భూమి ఉండాల్సి ఉండగా 30 గుంటల భూమి అధికంగా రికార్డుల్లో వస్తుండటంతో, సమస్య పరిష్కారానికి భూభారతిలో దరఖాస్తులు రావడంతో సర్వేను నిర్వహించారు ఈ సర్వేలో హత్నూర సర్వేయర్ శ్రీనివాస్ తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, డిప్యూటీ తహసీల్దార్ దావూద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, జిపిఒ, సిబ్బంది పాల్గొన్నారు. కాసాల పరిధిలోని సర్వే నంబర్ 324లో గతంలోనే ఎక్కువ ఉందంటూ ఫిర్యాదులు వచ్చినప్పటికీ సర్వే చేయడానికి అధికారులు చొరవ చూపలేదు. ఈ సర్వే నంబర్ పరిధిలో ఆర్టీసీ బస్టాండ్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వాణిజ్య సముదాయాలు, ఖరీదైన నివాస గృహాలు, స్థలాలు ఈ సర్వే పరిధిలోకి వస్తాయి. ఈ సర్వేలో విలువైన భూములు ఉండటంతో ఈ సర్వేకు ప్రాధాన్యత సంతరించుకుంది. సర్వే అనంతరం భూమి హెచ్చు తగ్గులపై స్పష్టత వస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఆయిల్‌ఫామ్ మొక్కలు నాటుతున్న అడిషనల్ కలెక్టర్ గరిమాఅగర్వాల్

## అధిక లాభాలు వచ్చే పంటలను సాగు చేయాలి

### అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్

**అక్కన్నపేట, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** రైతులు అధిక దిగుబడి వచ్చే పంటలు సాగు చేసుకోవాలని సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. గురువారం మండలంలోని మోత్కులపల్లి గ్రామానికి చెందిన రైతు గొర్ల కనుకయ్యకు చెందిన పొలంలో మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆయిల్ ఫాం సాగు చేయడం వల్ల అధిక లాభాలు వస్తాయని, పంట సాగు చేసుకునేందుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. అనంతరం అక్కన్నపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మహిళల అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి అన్ని పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో పిల్లలకు ఎలాంటి ఆహారం పెడుతున్నారని స్వయంగా పిల్లలనే అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూపరాణి, జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, ఎంపిడిఓ బానోతు జయరాం, మండల వ్యవసాయశాఖ అధికారి తస్లీమా సుల్తానా, ఎంపిఓ మోహన్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

## హుగ్గెలిని సందర్శించిన ఉత్తరప్రదేశ్ ప్రజాప్రతినిధులు



హుగ్గెల్లిలో పర్యటించిన ఉత్తర ప్రదేశ్ ప్రజాప్రతినిధులు

**జహీరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హుగ్గెల్లి గ్రామాన్ని గురువారం మహారాష్ట్రలోని బిజ్నూర్‌కు చెందిన ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు సందర్శించారు. గ్రామంలో అమలవుతున్న ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని రైతువేదికలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్రంలో అమలవుతున్న ఆన్‌లైన్ విధానాన్ని, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజెంటేషన్ ద్వార యూపి ప్రజాప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, ఆపాడు సీఈఓ రాఘవేందర్‌రావు, అనిల్‌కుమార్, ఎంపిడిఓ మహేందర్‌రెడ్డి, యూని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సింగూరుకు కొనసాగుతున్న వరద



సింగూరు ప్రాజెక్టు

**పుల్‌కల్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి వరద నీరు ఉధృతంగా వస్తుండటంతో పుల్‌కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గడం లేదు. ప్రాజెక్టులోని వరద నీరు ఉధృతంగా వస్తుండటంతో ప్రాజెక్టు 6 క్రస్ట్ గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 49176, ఔట్ ఫ్లో 50751 క్యూసెక్కులుగా నమోదయింది. ఆరు క్రస్ట్ గేట్ల ద్వార 48242 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 1849 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్ఎండబ్ల్యుఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 300 క్యూసెక్కులు ఆవిరి అవుతుండగా మొత్తం ఔట్ ఫ్లో 50.751 క్యూసెక్కులు నమోదయింది. గురువారం రాత్రి అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో 520.655 మీటర్లకు 17.067 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి.

## 22 నుంచి దేవి శరన్నవరాత్రులు

**పాపన్నపేట, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** ఏడుపాయల్లో ఈ నెల 22 నుండి దేవి శరన్నవరాత్రోత్సవాలు జరగనున్నాయి. ఆలయ సిబ్బంది గురువారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్కు ఆహ్వానపత్రిక అందజేశారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వన దుర్గమ్మ వద్ద నిర్వహించే దసరా శరన్నవ రాత్రోత్సవాల్లో మొదటి రోజు సోమవారం దుర్గమ్మ తల్లి శ్రీ బాల త్రిపుర సుందరిదేవి విశేష అలంకారంతో (గులాబి రంగువస్త్రంలో) దర్శనమిస్తారు. మంగళవారం శ్రీగాయత్రీదేవి(గులాబి), బుధవారం శ్రీఅన్నపూర్ణ(నీలం), గురువారం శ్రీవనదురా దేవి(ఆకువచ్చ) శుక్రవారం శ్రీమహాలక్ష్మిదేవి(పెసర), శనివారం లలిత త్రిపురసుందరీదేవి (ముదురు నీలం రంగు) ఆదివారం మహాచండి (నారింజ), సోమవారం శ్రీసరస్వతిదేవి(తెలుపు), మంగళవారం శ్రీదుర్గాదేవి (ఎరువు) బుధవారం శ్రీమహిషాసుర మర్దిని(మెరూన్) గురువారం రాజరాజేశ్వరదేవి (పసుపు రంగు) అలంకారంతో భక్తులకు దర్శనమిస్తారు. కాగా నెల 29న అమ్మవారికి బోనాలు, అక్టోబర్ 1న సువాసినిపూజ, చండీహోమం ఉంటుంది. వనదుర్గా సేవాసమితి అధ్వర్యంలో ప్రతిరోజు అన్నదానం నిర్వహిస్తారు.

**ఎమ్మెల్యేకు ఆహ్వానం**

ఏడుపాయల్లో జరిగే దసరా శరన్నవ రాత్రోత్సవాలకు హాజరు కావాల్సిందిగా కోరుతు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్కు ఆహ్వానపత్రం అందజేసినట్లు అర్చకులు శంకరశర్మ, జూనియర్ అసిస్టెంట్ సూర్య శ్రీనివాస్ తెలిపారు.

# కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలో మహిళా స్వయం సహాయక బృందాల తరహాలోనే 14 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు వయస్సు గల కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, పాఠశాల ఇంటర్మీడియట్, లేబర్, ఇండస్ట్రీస్, మెడికల్, హెల్త్, శిశు సంక్షేమశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లాలో కిశోర బాలికల సంఘాల ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. కిశోర బాలికల సంఘాల ఏర్పాటుతో ఎన్నో సామాజిక రుగ్మతలను రూపుమాపవచ్చని తెలిపారు. 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు జీవితంలో అత్యంత కీలక దశ అని ఈదశలో సరైన మార్గదర్శకం ఇస్తే కౌమార బాలికలు సమాజానికి దారి దీపమవుతారని తెలిపారు. బాల్యవివాహాలు, చదువు మానేయడం, రక్తహీనత, పోషకాహార లోపం, వేధింపుల వంటి ఎన్నో సవాళ్లు కౌమార దశలో బాలికలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి బాలికకు అవకాశాలు కల్పించడమే నిజమైన సాధికారత అని వివరించారు. డిఆర్‌డిఓ, డిడబ్ల్యుఓ సంఘాల ఏర్పాటులో భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల వారీగా సెర్ప్ ఎపిఎంలు, సీసీలు విఓఎలు ఈ సంఘాలను ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్య, అదనపు డిఆర్‌డివో సుధీర్, డిఎం అండ్ హెచ్ఓ. జిఎం ఇండస్ట్రీస్ గణేష్‌రామ్, జిల్లా ఇంటర్ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు టి.రేణుక, సెర్ప్ డిపిఎంఎస్ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియ వేగం పెంచాలి**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియ వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియపై ఎంపిడివోలు, ఎంపివో, హౌసింగ్ ఏఈ, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి జూమ్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏ మండలంలో ఇసుక కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఇంజనీర్ అధికారులు తరుచూ ఇందిరమ్మ లబ్దిదారులకు గృహాలు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తిచేసేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పూర్తిచేసిన ఇళ్లను ప్రారంభించడానికి సిద్ధం చేయాలన్నారు.

# 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' ఉపయోగించుకోవాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



పావన్నపేట పిహెచ్‌సిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**పాపన్నపేట, సెప్టెంబరు 18, ప్రభాతవార్త**

ఆరోగ్యవంతమైన కుటుంబం దేశ సంక్షేమాన్ని సూచిస్తుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. గురువారం ఆయన పాపన్నపేట పిహెచ్‌సిలో కొనసాగుతున్న స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన కుటుంబం దేశ సంక్షేమానికి కొలమానంగా చూడవచ్చన్నారు. ముఖ్యంగా ఇంటికి దీపమైన ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆనందంగా ఉంటుందని చెప్పారు. అందుకే ప్రభుత్వం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. తల్లి ఆరోగ్యం పరిపూర్ణంగా ఉంటే పుట్టబోయే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమంపై దృష్టి పెట్టి యాక్షన్ ప్లాన్ రూపొందించాయన్నారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు 15 రోజులు ప్రతి వైద్య కేంద్రంలో నిరంతర వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. మహిళా శిశు ఆరోగ్యానికి 14రకాలైన సేవలు, మెగా శిబిరాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో గర్భిణీలు, ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిచ్చేలా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులను అరికట్టాలి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని ఆయా గ్రామాలలో సీజనల్ వ్యాధుల బారిన పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరి రవీందర్ అన్నారు. గురువారం సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మండలంలోని గ్రామాలలో ప్రతి రోజు కురుస్తున్న వర్షాల వలన అన్ని వీధుల్లో చెత్తా, చెదారం, గడ్డి ఉండడం వలన దోమలు, ఈగలు విపరీతంగా వృద్ధి చెందడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దోమల వలన ప్రజలకు అనేక జబ్బులు వస్తున్నాయని గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో దోమల నివారణ మందుతో పాటు గడ్డి మందు పిచికారి చేయాలన్నారు. బురద ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లి కీటకాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తాడూరి మల్లేశం, సార్ల యాదయ్య, తాడూరి నరేష్, ఆరుట్ల రవీందర్, కనుగుల రాజు, తాడూరి భరత్‌కుమార్, కర్రోల రాకేష్, చింతల ఇంద్రుడు, శ్రవణ్‌చారి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బ్యాతోల్, ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో

# యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

### చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం





ఇస్మాయిల్‌ఖాన్ పేటలో తయారు చేస్తున్న కృత్రిమ ఇసుక

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :**

సంగారెడ్డి నియోజకవర్గంలోని కంది మండలం బ్యాతోల్, సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్ గ్రామాల పరిధిలో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరుకాయలుగా యథేచ్ఛగా సాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు ఎన్ని ఫిర్యాదులు చేసినా, ప్రభుత్వం ఎన్ని చట్టాలు రూపొందించినా ఇక్కడ అక్రమార్కుల ముందు బలాదూర్‌గా మారాయని వారు విమర్శిస్తున్నారు. నక్క వాగు ఇప్పుడు ఇసుక మాఫియా చేతుల్లో చిక్కి విలవిలలాడుతోందని, కొంతకాలంగా ఈ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా అడ్డు అదుపు లేకుండా కొనసాగుతోందని, ఇది కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాకుండా, పర్యావరణానికి, ప్రజల జీవనానికి పెనుసవాలుగా మారిందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం ఇసుకతవ్వకాలపై కఠినమైన నిబంధనలు విధించినప్పటికీ, అక్రమ రవాణాదారులు వాటిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బ్యాతోల్ ఇస్మాల్‌ఖాన్‌పేట గ్రామాల పరిధిలో కృత్రిమ ఇసుక రవాణా విషయం బహిరంగ రహస్యం అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో అధికారులు వచ్చే విషయాన్ని పసిగట్టేందుకు కొన్నిచోట్ల ఇసుక మాఫియా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తుందని స్థానికులు తెలిపారు. అనేకసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదని, అప్పుడప్పుడు నామ మాత్రపు తనిఖీలు, వాహనాల జప్తు జరుగుతున్నప్పటికీ, అవి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని, రాజకీయ పలుకుబడి ఉన్న కొందరు ఈ అక్రమ వ్యాపారంలో భాగస్వాములుగా ఉన్నారని, అందుకే అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు పలువురు ఆరోపిస్తున్నారు. నీటితో శుద్ధిచేసి ఇసుకను తీసుకొని వ్యర్థాలను నక్క వాగులోకి వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పగలు కృత్రిమ ఇసుకను తయారు చేసి రాత్రి సమయాలలో లారీలలో దూర ప్రాంతాలకు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో భారీ వాహనాల రాకపోకలతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని, అంతేగాక వాటి శబ్దాలు ప్రజల ప్రశాంతతను దూరం చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యకు ముగింపు పలకాలంటే, ప్రభుత్వం, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనాఉందని స్థానికులు అంటున్నారు రాత్రిపూట నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారికి భారీ జరిమానాలు, కఠినమైన శిక్షలు విధించాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ఈ విషయమై సంగారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీఓ పాండును వివరణ కోరగా ఇస్మాయిల్‌ఖాన్‌పేట్, బాత్తోల్ గ్రామాలలో ఇసుక రవాణా తయారు కాకుండా విఆర్ఎలతో నిఘా ఉంచామని, ఎట్టి పరిస్థితుల్లో ఇసుక అక్రమ రవాణా జరగవద్దని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని అన్నారు, అధికారులు నిర్లక్ష్యం చేస్తే ఉద్యోగాలకు ఇబ్బంది కలుగుతుందని హెచ్చరికలు ఇచ్చామని, మంగళవారం మూడు లారీలను ఒక యంత్రాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఆర్డీఓ పాండు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.



అలుగు పారుతున్న దృశ్యం

# అలుగు పారుతున్న రాజగోపాల్‌పేట పెద్ద చెరువు

**నంగునూర్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని రాజగోపాల్‌పేట పెద్ద చెరువు అలుగు పారుతోంది. సిద్దిపేట నియోజకవర్గంలోని అత్యంత పెద్ద చెరువుల్లో ఒకటైన రాజగోపాల్‌పేట పెద్దచెరువు మూడేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో నీటతో కళకళలాడుతుంది. మూడేళ్ల తర్వాత చెరువు అలుగు పారుతుండడంతో ఈ ప్రాంత రైతుల్లో ఆనందం నెలకొంది. ఈ చెరువులో ఒకసారి నీరు చేరితే మండలంలోని వివిధ గ్రామాల్లో రెండేళ్ల వరకు సాగునీటికి కొరత ఉండదనే నానుడి ఉంది. ఈ ప్రాంతంలో కరవు పరిస్థితులను 1998లో అధ్యయనం చేసిన అప్పటి రవాణాశాఖ మంత్రి, తెలంగాణ రాష్ట్ర మాజీ సిఎం కెసిఆర్ ప్రత్యేక చొరవతో సిద్దిపేట కోమటిచెరువు మత్తడి నుంచి మందపల్లి వాగు ద్వారా వెళ్తున్న నీటిని మిట్టపల్లి చెరువులోకి తరలించేందుకు నర్సాపూర్, రంగధాంపల్లి, మిట్టపల్లి, ముంద్రాయి గ్రామాల్లోని చెరువులను కలుపుతూ రాజగోపాల్‌పేట పెద్దచెరువులోకి కట్టు కాలువను తవ్వించారు. అప్పటినుంచి ఇప్పటివరకు నాలుగుసార్లు చెరువు నిండింది. ఇటీవల ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు వరద వచ్చి చేరడంతో రాజగోపాల్‌పేట చెరువులోకి నీరు చేరడంతో చెరువు నిండుకుండలా మారింది. వరద వచ్చి చేరుతుండడంతో గురువారం ఉదయం నుంచి అలుగు పారుతుంది. దీంతో ఈ ప్రాంత రైతులు చెరువుకు వచ్చి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

## రోడ్ల విస్తరణకు నిధులు మంజూరు చేయాలి

### ముఖ్యమంత్రికి వినతిచేసిన ఆవుల రాజిరెడ్డి

**నర్సాపూర్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:** నర్సాపూర్ నియోజకవర్గంలో పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా మారడంతో ఈ రోడ్ల రహదారుల విస్తరణకు నిధులు మంజూరుచేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌వార్జి ఆవుల రాజిరెడ్డి వినతిపత్రాలు అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ లోగల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఆవుల రాజిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను ప్రతిపాదించారు మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని, అంతారం గ్రామాన్ని కౌడిపల్లి మండలం కలపాలని, నర్సాపూర్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయాలని, నర్సాపూర్ పట్టణంలో కోర్టు భవనం, ఆర్డీఓ ఎమ్మార్వో, అగ్రికల్చర్, ఎక్సైజ్ శాఖ కార్యాలయాలు నిర్మించడానికి నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా కొత్తగా ఏర్పడిన చిలిపి చెడ్, మాసాయిపేట మండల కేంద్రాల్లో ఎమ్మార్వో ఎంపీడీవో పోలీస్ స్టేషన్ల భవనాలను నిర్మించాలని ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు అలాగే ఆర్ అండ్ బి శాఖ కింద రోడ్ల రహదారి విస్తరణకు 150 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా పంచాయతీరాజ్ శాఖ కింద వచ్చే రహదారులు వంతెనలు నిర్మాణం చేయడానికి 15 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రతిపాదించిన పలు రోడ్ల నిర్మాణాలకు ఫలితంగా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అభ్యర్థులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించి వీటన్నింటిని నిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు.

## భార్యాభర్తల ఆత్మహత్యా యత్నం

### భర్త మృతి, చికిత్స పొందుతున్న భార్య

**కొల్చారం, సెప్టెంబరు 18(ప్రభాతవార్త):**

కూతుళ్ల పెళ్లిళ్లకు చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక భార్యాభర్తలు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశారు. భర్త మృతి చెందగా భార్య ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ సంఘటన కొల్చారం మండలం పోతిరెడ్డి పల్లిలో జరిగింది. కొల్చారం ఎస్ఐ మోహియుద్దీన్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన నిరుడి నరసింహులు(42) వ్యవసాయం చేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరి వివాహానికి రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. ఈ అప్పులు ఎలా తీర్చా లో అని నరసింహులు బాధపడుతుండేవాడు. అప్పు ఎలా తీర్చాలని బాధపడుతూ ఈ నెల 14న ఉదయం 11.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని గడ్డిమందు తాగారు. మంటలకు తట్టుకోలేక నరసింహులు, యశోద అరుస్తుండగా విని నిరుడు బాలయ్య వెళ్లి చూసి వెంటనే చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లాడు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నరసింహులు బుధవారం సాయంత్రం మృతి చెందాడు. భార్య యశోద గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మృతుడి తండ్రి నిరుడి బాలయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్నున్నట్లు ఎస్ఐ మోహియుద్దీన్ తెలిపారు.

## దౌల్తాబాద్‌లో వరుస దొంగతనాలు

### రెండు చోట్ల చోరీలు..నగదు, బైక్ అపహరణ

**హత్నూర, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**

హత్నూర మండలం మేజర్ గ్రామ పంచాయతీ దౌల్తాబాద్ గ్రామంలో దొంగలు రెచ్చిపోయారు. బుధవారం రాత్రి గ్రామంలోని రెండుచోట్ల చోరీలకు పాల్పడ్డారు. కుమ్మరి రమేష్‌కు చెందిన ఎరువుల దుకాణంలోని షట్టర్ తాళాలు పగలగొట్టి తీసి లోపలికి వెళ్లి రూ. 2000 నగదును అపరించుకుపోయారు. అనం తరం పక్కనే ఉన్న డాక్టర్ కిరణ్‌కుమార్ క్లినిక్ షట్టర్‌ను తొలగించి లోపలికి వెళ్లి నగదును అపహరించారు. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఈ దొంగతనం జరిగినట్లు సిసి ఫుటేజ్ ద్వారా తెలిసిందని బాధితులు తెలిపారు. వారం లోపల దౌల్తాబాద్‌లో ఒక కిరాణా షాపులో చోరీకి పాల్పడగా, ఒక బైకును అపహరించారు. దీంతో పాటు గోవిందరాజు పల్లి గ్రామంలోని ఒక ఎరువుల దుకాణానికి కన్నం వేసి అందులో ఉన్న నగదును దోచుకొని వెళ్లారు. దొంగలు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ హత్నూర పోలీసులకు సవాలుగా మారారు. పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిన దౌల్తాబాద్‌లో రాత్రిపూట పోలీసులు రోజు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నప్పటికీ దొంగతనాలు జరగడం గమనర్హం.

### ఉజ్జయినీ మహాకాళీ హుండీ ఆదాయం రూ 18,90,150లు



శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో హుండీ లెక్కింపు జరుగుతున్న దృశ్యం.

**బేగంపేట సెప్టెంబరు 18,ప్రభాతవార్త**
సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ దేవస్థానం హుండీ లు గురువారం ఆలయ ప్రాంగణంలో లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ లెక్కింపు కార్యక్రమం ఆలయ కార్యనిర్వహణాధికారి మనోహర్‌రెడ్డి, సికింద్రాబాద్ సహాయ కమీషనర్ శ్రీదేవి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబరు ఆధ్వర్యంలో లెక్కింపు కార్యక్రమం జరిగింది. హుండీలలో నోట్లు రూ 18,90,150లు, కాయిన్స్ రూ 1,57,597లు, మొత్తం రూ 20,47,747లు ఆదాయం వచ్చింది. దీంతో పాటు బం గారు 76గ్రా,700మి.గ్రా, వెండి 700గ్రా600మి.గ్రాములు వచ్చినట్లు ఆలయ ఈఓ మనోహర్ రెడ్డి తెలియజేసారు.

### రాష్ట్ర స్థాయి టిఎల్‌ఎం మేళాకు ఎంపికైన రాజారావు

**నిజాంపేట్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
తన మేదస్సును ఉపయోగించి, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ల విద్యార్థులకు వివిధ గణిత భావనలు సులభంగా బోధించే విధంగా మల్టీ కాంసెప్ట్ బాక్స్ అనే టిఎల్‌ఎం పెట్టెను తయారు చేసి, న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన విషయ నిపుణులను, జిల్లా అధికారులను రాజారావు మెప్పించారు. బాచుపల్లి మండలంలోని ఇందిరా నగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన రాజారావు రాష్ట్ర స్థాయి టిఎల్‌ఎం మేళాకు ఎంపిక అవ్వడం పట్ల పిఆర్‌టియుటిఎస్ బాచుపల్లి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పర్మగళ్ళ నర్సిములు, మాలి ప్రమోద్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజారావు తన అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి మన జిల్లా నుంచి స్టేట్ లెవల్ టిఎల్‌ఎం మేళాకు ఎంపిక కావడం మనందరికీ గర్వకారణమని కొనియాడారు. అనంతరం రాజారావును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియుటిఎస్ బాచుపల్లి మండల అసోసియేట్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి శివప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మజలత, ఉపాధ్యాయులు సునిత తదితరులు పాల్గొన్నారు.

### కుమ్మరి రాములు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ

**కేశంపేట సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**
కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కుమ్మరి రాములు అనారోగ్యంతో మృతి చెందడం మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. గురువారం కొత్తపేటలోని కుమ్మరి రాములు నివాసానికి స్థానిక నాయకులతో వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రాములు భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డితో పాటు కొత్తపేట మాజీ సర్పంచ్ కామ్లెకర్ నవీన్ కుమార్, మాజీ ఎంపిటిసి మల్లేష్ యాదవ్, పోమాలపల్లి మాజీ సర్పంచ్ భూపాల్ రెడ్డి, పాపిరెడ్డి గూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, కాకునూరు మాజీ సర్పంచ్ యారం చంద్రకళ శేఖర్ రెడ్డి, నాయకులు నాగిళ్ళ వెంకటేష్, జగన్ రెడ్డి, యాదయ్య, క్రిష్ణ, కుమార్ గౌడ్, రజినీకాంత్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలి : సిపిఐ



**అత్తాపూర్ సెప్టెంబరు18 ,ప్రభాతవార్త :**
బస్తీ దవఖాన ఏర్పాటు చేయాలని కోరుతూ సిపిఐ రాజేంద్రనగర్ మండల సమితి జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతల్ మెట్ మరియు సులేమాన్ నగర్‌లో బస్తీ దవఖాన ఏర్పాటు చేయాలని పేదల ప్రజలకు అందుబాటులో వైద్య లేక ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్‌కు సమస్యను వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో బస్తీ దవఖాన ఏర్పాటు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు, సిపిఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి ,జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంఏ రియాజ్ ,జిల్లా సమితి సభ్యులు జే ఆనంద్ గౌడ్ ,మండల సహాయ కార్యదర్శి జె విజయ్, ఆనంద్ గౌడ్ ,చింతల్ మెట్ కార్యదర్శి ఎండి కాజా ,సిపిఐ మండల కార్యాలయం కార్యదర్శి జి సత్యం ,మండల కౌన్సిల్ సభ్యులు సదానంద్ గౌడ్ ,ఖలీల్ ,తదితరులు ఉన్నారు.

### ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



**అత్తాపూర్ సెప్టెంబరు18 ,ప్రభాతవార్త :**
ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పలువురు బిజెపి నాయకులు పేర్కొన్నారు. గురువారం ఉప్పర్‌పల్లి ఐబి పాలస్‌లో బిజెపి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ హాస్పిటల్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పలువురు బిజెపి నేతలు యువకులు పాల్గొని రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో యు శ్రీధర్, మల్లారెడ్డి, సత్యనారాయణ, బొక్క బాలిరెడ్డి, బాబూరావు, సోల్జర్ రెడ్డి, వనిత రెడ్డి, షాబాద్ విజయ్ ,బాలకృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, వాసు, జనరల్ సెక్రటరీ శీ రాజశేఖర్ రెడ్డి, పవన్ ,వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, కవిత, సరిత రెడ్డి, అంబిక, పద్మావతి, స్వప్న రెడ్డి, రాకేష్ గౌడ్, రవికాంత్, విజయ్ యాదవ్, శివ, గోపాల్ ముదిరాజ్ ,వంశీ పుస్తకాల, సుధాకర్ రెడ్డి, మరియు నాయకులు పాల్గొన్నారు

### మార్వాడీ హటావో నినాదానికి నేను వ్యతిరేకం

**: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు**

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
మనమంతా భారతీయులం, భారతీయులంతా ఎక్కడైనా జీవించవచ్చు మార్వాడీ హటావో నినాదానికి నేను వ్యతిరేకమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు అన్నారు. బుధవారం ఆయన ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ఏ రాజకీయ పార్టీకి సంభదం లేదని, అందరికి ఒక్కటే రాజ్యాంగమని తెలిపారు. అందరికీ ఒక్కటే పాస్ పోర్ట్, విదేశాలలో మన భారతీయులు ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించారన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మన ఇండియా అని వివిధ రాష్ట్రాలలో మన తెలంగాణ వారు స్థిర నివాస ఏర్పచుకొవచ్చున్నారు. ఈ భీజం పెరిగి పెద్దదైతే మనమే నష్ట పోతామని, అభివృద్ధి కుంటు పడుతుందని, కులాలా వారిగా మతాల వారిగా విడిపోతే నష్టపోయేది మనమేనని అన్నారు. నీవు నేను కలిస్తే మనం, మనం మనం కలిస్తే జనం, ఎక్కడో జరిగిన పొరపాటు ఇక్కడ రుద్దడం సరికాదని అన్నారు. అందరు కలసి సమైక్యంగా ఉందామని పిలుపునిచ్చారు.

## ప్రమాదానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే : తలసాని



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**సంజీవరెడ్డి నగర్,సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :** మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి కురిసిన బారీ వర్షానికి బల్కంపేట నుండి బేగంపేట వైపు వచ్చే రోడ్డుల గల రైల్వే బ్రిడ్జి కింద నీటిలో మునిగి ముషీరాబాద్‌కు చెందిన షర్ఫోద్దిన్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. బల్కంపేట ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు ఆపి ఛాలాన్లు వేస్తున్నారని, వారి నుండి తప్పించుకునే క్రమంలో ఈ ఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. బ్రిడ్జికింద లైట్లు లేక పోవడం కూడానఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. సంబంధిత అధికారులను వెనువెంటనే లైట్లను, స్పీడ్ బ్రేకర్స్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షర్ఫోద్దీన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాడ సంతాపం తెలిపారు. ప్రమాదానికి ప్రభుత్వమే బాధ్యత వహించి మృతిని కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. జిహెచ్‌ఎంసి కమీషనర్‌తో మాట్లాడి ఆర్థిక సహాయం మంజూరుకు కృషి చేస్తానన్నారు. వర్షం కురిసినప్పుడు బ్రిడ్జికింద చెరువును తలపించేలా నీరు నిలిచి వాహన దారులు పలు ఇబ్బందులకు గురౌతున్నారని, బ్రిడ్జికింద నీరు నిల్వకుండా సమీపంలో ఉన్న నాలాలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు అప్రమత్తంగా ఉన్నామని ప్రకటనలు చేస్తున్నారు కానీ ఆచరణలో ఎక్కడా లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు ఎందుకు జరుగుతాయని ప్రశ్నించారు. ఎక్కడా ఒక ప్రాణ నష్టం కూడా జరుగకూడదని తాను కోరుకున్నట్లు ఆయన అన్నారు. ప్రమాదాలు ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనమని, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి నాలాల్లో పూడిక తొలగిస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికి, నాలాల్లో పూడిక అలాగే కనిపిస్తుందన్నారు. మున్సిపల్ శాఖ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వద్దనే ఉందని, ఈ అంశంపై ముఖ్య మంత్రి సమీక్ష చేయాలని, లేదంటే క్షేత్ర స్థాయిలో పర్యటిస్తే వాస్తవాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ నామన శేషుకుమారి, డిసి.జయంత్, ఈఈ. వెంకట రమణ, హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసిపి మన్సూర్, డిఈ దీప్తి, సనత్ నగర్, అమీర్‌పేట్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, హన్మంతరావ్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఖలీల్, నామన సంతోష్ కుమార్, శ్రీహరి, కర్నాకర్ రెడ్డి, నోమాన్, వసీం ఆరీఫ్, వనం శ్రీనివాస్ తదితిరులు పాల్గొన్నారు.

## రంగస్థల రంగానికి పెద్దపీట : డా. ఏనుగు నరసింహారెడ్డి



సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న డా. ఏనుగు నరసింహారెడ్డి

**రవీంద్రభారతి, సెప్టెంబరు 19 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ రాష్ట్రంలో మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, అన్ని కళలు ఇతోధికంగా ప్రోత్సహించ తలపెట్టిందని, రంగస్థల రంగానికి పెద్దపీట వేస్తుందని సాంస్కృతికశాఖకు నూతన నియమితులైన సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి భరోసానిచ్చారు. శతవసంతాల పైబడిన సురభి నాటక సంస్థ సాంకేతిక పరిజ్ఞానం లేనికాలంలో కూడా తనదైనశైలిలో ప్రతిభను కనబరిచి ప్రత్యేకతను సంతరించుకొందని అన్నారు. ఎందరో మహామహులున్న సురభి నాటక సంస్థల్లో ఆవేటి రఘునాథ్ ప్రముఖుదుని కొనియాడుతూ ఆయన లేనిలోటు పూడ్చలేనిదన్నారు. చైతన్య ఆర్ట్ థియే టర్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకుడు కె.కె. రాజా నేతృత్వంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రంగస్థల ప్రముఖుడు సురభి ఆవేటి రఘునాథ్ సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నరసింహారెడ్డి పలువురు రంగస్థల ప్రముఖులతో కలిసి రఘునాథ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి మాట్లాడారు. రంగస్థల రంగంలలో సాంకేతిక నిపుణుడుగా గుర్తింపుతోపాటు 50మందికిపైగా శిష్యులకు మేకప్, కాస్ట్యూమ్స్ తయారు చేయడంలో శిక్షణ ఇచ్చాడని, 1990లో అంతరించిపోతున్న సురభి నాటక కళాకారుల నివాసం కోసం 140 గజాల చొప్పున శేరిలింగం పల్లిలో 250మంది కళాకారులకు ఇళ్లస్థలాలు ఇప్పించిన ఘనత రఘునాథ్‌కే దక్కుతుందని పలువురు వక్తలు తెలిపారు. ప్రస్తుతం వెయ్యిమంది కుటుంబసభ్యులు ఒకే కాలనీలో నివాసం అరుదైన విషయమన్నారు. మాట్లాడిన వారిలో నృత్యగురువులు కళాకృష్ణ, అంజిబాబు, సురబి కోదండ రావు, చంద్రశేఖర్, ఫణిభూషన్ తదితరులున్నారు.

## 22నుంచి ఫిబ్రవరి 4వరకు "సాయినామ శత కోటి మహాయజ్ఞం"

**-షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్టు అధ్యక్షులు బి.వి.శ్యామ్‌కుమార్**



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శ్యాంకుమార్, రఘుకుమార్, నరసింహగుప్త, మల్లయ్య, శ్రవణ్‌కుమార్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 18,ప్రభాతవార్త:**
శ్రీసాయి నామ శత కోటి జన మహా యజ్ఞం ఈ నెల 22 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 4 వరకు నిర్వహిస్తామని శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్టు అధ్యక్షులు బి.వి. శ్యామ్‌కుమార్, ప్రధానకార్యదర్శి రఘు కుమార్, కోశాధికారి నరసింహ గుప్తా తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్లో జరిగిన సమావేశంలో యజ్ఞానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. లోక కల్యాణార్థం, భక్తుల కోరిక మేరకు జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని సూచించారు. సాయి నామ జప యజ్ఞం కార్యక్రమాన్ని పూర్తిచేసే వారు సామాజిక మాధ్యమాల్లో తెలియజేయడానికి ప్రత్యేక వాట్సాప్ నంబర్ 8500966566, 9492646780 ను ప్రారంభించామని తెలిపారు. షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్టు, దిల్‌సుఖ నగర్ హైదరాబాద్‌బాబా వారి డాలర్ బొమ్మ కలిగిన రుద్రాక్షమాలను మెడలో ధరించి సాయి సన్నిధిలో తులసీమాలతో జపము చేసి, కౌంటింగ్ షీట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన "గురుస్థాన్"నందు అందజేయాలని సూచించారు. వివరాలకు శ్రీ షిరిడి సాయి బాబా సంస్థాన్ ట్రస్టు, దిల్‌సుఖ్ నగర్, పిఆర్ఒ ఆఫీసులో సంప్రదించాలని తెలిపారు. 142 రోజులు జరిగే యజ్ఞ కార్యక్రమంలో ఉచితంగా అన్నదానం చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సంస్థాన్ మాజీ చైర్మన్ జి. మల్లయ్య, శ్రవణ్ కుమార్, స్వామిజీ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## మహేంద్ర మేదర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.1000కోట్లు కేటాయించాలి



ప్రసంగిస్తున్న జంటనగరాల మహేంద్ర మేదర సంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్ తదితరులు

**చిక్కడపల్లి, సెప్టెబరు 18 ప్రభాతవార్త:** మహేంద్ర మేదర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.1000కోట్లు కేటాయించి వెంటనే చైర్మన్, పాలక మండలిని నియమించాలని జంటనగరాల మహేంద్ర మేదర సంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెదురు పెంపకానికి నగర శివారు ప్రాంతంలో వెయ్యి ఎకరాలు కేటాయించాలన్నారు. గురువారం చిక్కడపల్లిలోని జంటనగరాల మహేంద్ర మేదర సంఘం కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవం జరిగింది. ఈ సమావేశంలో రేషంమల్లేష్ మాట్లాడుతూ మహేంద్ర మేదర కులస్తులను ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలుగు రాష్ట్రాలకు చెందిన తమను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. ఉప్పల్ భగాయత్‌లో మేదర ఆత్మగౌరవ భవనానికి కేటాయించిన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. జంటనగరాల మహేంద్ర సంఘానికి ఎకరం స్థలం నగరంలో కేటాయించాలన్నారు. మహేంద్ర కులస్తులకు ఉపాధి కోసం ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి 10 లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. వెదురు కొరత లేకుండా ఆవసరం ఉన్న వారికి సబ్సిడీతో వెదురును సరఫరా చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ కులానికి తగిన సీట్లు, నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లి గురుమూర్తి, ఉపాధ్యకుడు పిల్లి రాంకుమార్, ప్రచార కార్యదర్శి కె.నర్సింగరావు. ఆర్గనైజింగ్ సెక్రటరీ పిల్లి రాజగోపాల్, కోశాధికారి విశైలాష్, సహాయ కార్యదర్శులు రామకృష్ణ, వేణుగోపాల్, నాయకులు జె.బలరాం, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైంది

**స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్**



కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డా. వివేకానంద్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 18,ప్రభాతవార్త:**
ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదేనని జిహెచ్ఎంసి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్ అన్నారు. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల త్వరలో జరగ నున్న నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మార్గదర్శనంలో జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజ కవర్గ పరిధిలో స్వీప్ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. యువతను ఓటరుగా నమోదు చేయించడంతో పాటు ఓటింగ్ శాతాన్ని మరింత పెంచేలా స్వీప్ కార్యక్రమాలను విస్తృతం చేశారు. ఈ క్రమంలో గురువా రం ఎర్రగడ్డలోని డాన్ బాస్కో డిగ్రీ కళాశాలలో స్వీప్ అవగాహన కార్యక్ర మంలో డా. వివేకానంద్ మాట్లాడారు. ఎన్నికలలో ప్రజల చురుకైన భాగ స్వామ్యంతోనే ప్రజాస్వామ్యం బలపడుతుందని చెప్పారు. నియోజ కవర్గంలో జులై 1, 2025 నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో ఎన్నికల్లో పాల్గొంటే రాజకీయ వ్యవస్థలో స్వచ్ఛత, పారదర్శకత పెరుగుతుందనీజిహెచ్ఎంసి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్ చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజశేఖర్, సి.ఓ వెంకటయ్య, శోభారాణి, రిసోర్స్ పర్సన్‌లు రామలక్ష్మి , మహమ్మద్ గౌస్, యాదయ్య పాల్గొన్నారు.

### గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

**-నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ**



ప్రసంగిస్తున్న నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ

**చిక్కడపల్లి, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:**
గ్రంథాలయల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నట్లు అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ అన్నారు. గురువారం అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో జరిగిన ప్రజా పాలన దినోత్సవము సందర్భంగా జరిగిన సభలో పద్మజ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ సంస్థ ప్రథమ శ్రేణి గ్రంథపాలకులు ఎల్.చంద్రకళ, సుబ్బ లక్ష్మి, సంస్థ సిబ్బంది వెంకటేశ్వర్ రెడ్డి, రామ్ మోహన్, వెంకటేశ్ యాదవ్,పి. డి. మహేశ్, సాంకేతిక విభాగము సిబ్బంది కృష్ణా రెడ్డి గ్రంథాలయ సంస్థ విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ,పీజీ అడ్మిషన్ గడువు పొడిగింపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి,వెంకటేశ్వర్లు, మారోజు రామాచారి తదితరులు.

**బేగంపేట సెప్టెంబరు 18,ప్రభాతవార్త**
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ సేవా విభాగము డైరెక్టర్ డా.వై.వెంకటేశ్వర్లు అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువు పొడిగించినట్లు తెలియజేసారు. సెప్టెంబరు 24వరకు డిగ్రీ, మరియూ పీజీ అడ్మిషన్ల గడువును పొడిగించారన్నారు. అదే విధంగా ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, డిప్లమా పాస్ అయిన వారు డిగ్రీ అడ్మిషన్లు పొందవచ్చున్నారు. డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ పాస్ అయిన వారు పీజీలో ఎంఏ లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ,పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఎకనామిక్స్, హిస్టరీ మరియూ ఇంగ్లీషు లిటరేట్ తెలుగు తెలుగు లిటరేట్ హిందీ లిటరేట్ అడ్మిషన్లు పొందవచ్చున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం ,డిగ్రీ రెండవ సంవత్సరం మూడవ సంవత్సరం విద్యార్థులు సెప్టెంబరు 26వరకు అడ్మిషన్లు ఫీజు చివరి తేదీ అని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ సీటీ బేగంపేట రీజినల్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ మారోజు రామాచారి తెలిపారు. ప్రిన్సిపాల్ కళాశాల పద్మావతి మాట్లాడుతూ ఈ కళాశాలలో మహిళలకు ప్రత్యేక వసతులు ఉన్నాయని, అదే విధంగా కౌన్సిలింగ్ క్లాసెస్ త్వరలో జరగబోతుందని తెలిపారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని పరీక్షల నియంత్రణ అధికారి డా.బి.శ్రీనివాస్ తెలియజేసారు.

## గోవుల రక్షణలో ప్రభుత్వం విఫలం : రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్



శ్రీ జగన్నాథ స్వామి మఠం గోశాలలో గోవులకు పచ్చిగడ్డి పంపిణీ చేస్తున్న గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్,మఠాధిపతి అక్షుత్ రామానుజాచార్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త**
గోవులను రక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. గోవుల సెంటిమెంట్ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గో ప్రేమికులు, పెంపకందార్లతో ఆడుకుంటోందని ఆయన ఆరోపించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జంతు సంక్షేమ విభాగం డిస్ట్రిక్ట్ చైర్మన్ ప్రేమ్ చంద్ మునోథ్ ఆధ్వర్యంలో గురువారం శ్రీ జగన్నాథ స్వామి మఠం గోశాలలో గోవులకు పచ్చిగడ్డి, దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ ఆగర్వాల్ మాట్లాడుతూ రాజస్థాన్, పంజాబ్, చతీష్‌ఘడ్, హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు గోశాలల్లో ఉన్న ప్రతి గోవు సంరక్షణ అక్కడి ప్రభుత్వాలే చూసుకునేవారని, గోశాలలకు కోట్లాది రూపాయల నిధులు ఇచ్చారని పేర్కొన్నారు. గోఉత్పత్తులను కూడా అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాలే కొనుగోలు చేసేశారని ఆయన తెలిపారు. తెలంగాణలో మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం గోవుల విషయంలో హామీలతో సరిపెట్టుకుంటుందే తప్ప ఆచరణలో ఒక్కపని కూడా చేయడం లేదని విమర్శించారు. గోశాలలు పెడతామంటున్నారే తప్ప ఇప్పటి వరకు ఉన్న ఏ ఒక్క గోశాలకు కూడా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. పశుసంవర్ధ శాఖకు ఇప్పటి వరకు పూర్తి స్థాయి డైరెక్టర్‌ను కూడా నియమించలేని ప్రభుత్వం గోవులకు రక్షణ ఎలా కల్పిస్తుందన్నారు. పశు సంక్షేమ బోర్డుకు కమిటీని ఏర్పాటు చేసి, గోవుల రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జస్మత్‌పటేల్, రితేష్ జాగీర్దార్, భరత్ భట్, ముఖేష్ జైన్. శ్రీ జగన్నాథ మఠాధిపతి అక్షుత్ రామానుజాచార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ సాహితీవేత్తలకు పరిషత్తు ధర్మనిధి సాహిత్య పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో శివారెడ్డి, చెన్నయ్య, వసుంధరారెడ్డి, పి.సుమతీ, బిఎస్.రాములు, వసునందన్, పి.లక్ష్మారెడ్డి, రామమూర్తి తదితర అతిథులు

**నాంపల్లి, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సాహితీ ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు 2025 సంవత్సరానికిగాను ప్రతిష్టాత్మక ధర్మనిధి సాహిత్య పురస్కారాలను ప్రదానం చేసింది. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో విశేషకృషి చేసిన 9మంది ప్రముఖులకు పరిషత్తులోని దేవులపల్లి రామానుజరావు కళావేదికలో గురువారం రాత్రి అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య, విశిష్ట అతిథులు వసుంధరారెడ్డి, పి.సుమతీ నరేంద్ర, బిఎస్.రాములు, రావికంటి వసునందన్, డా. పి.లక్ష్మారెడ్డి, రింగు రామమూర్తి తదితరులతో కలిసి పురస్కారాలు అందించారు. డా. రాయారావు సూర్యప్రకాశరావుకు ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ; వేముగంటి మురళీకృష్ణకు ఆలూరి బైరాగి; డా. సంధ్యావిప్లవ్‌కు డా. పాకాల యశోదారెడ్డి; పింగిలి సుదర్శన్‌రెడ్డికి డా. వానమామలై వరదాచార్య పురస్కారాలు ప్రదానం చేస్తారు. డా. పొణుగోటి సరస్వతికి డా. చింతపల్లి వసుంధరారెడ్డి జానపద విజ్ఞాన పురస్కారం, డా. తూర్పు మల్లారెడ్డికి డా. బెజవాడ గోపాల్‌రెడ్డి పురస్కారం, డా. సాగి కమలాకరశర్మకు డా. దివాకర్ల వెంకటావధాని పురస్కారం, కందుకూరి అంజయ్యకు డా. రావికంటి వసునందన్ పురస్కారం, మ్యాకం రవికుమార్‌కు విశాల సాహితీ బిఎస్.రాములు పురస్కారం అందుకున్నారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి 5వేల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సత్కరించారు.

### ప్రతి పౌరుడు స్వచ్ఛతకు కట్టుబడి ఉండాలి



**కొత్తూరు సెప్టెంబరు18,ప్రభాతవార్త :**
బీజేపీ సేవా పక్వాడ్ కార్యక్రమాలలో భాగంగా గురువారం కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల సేవా పక్వాడ్ ఇంచార్జ్ వెంకటేష్ గుప్తా, మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా సేవా పక్వాడ్ కో కన్వీనర్ పసుపుల ప్రశాంత్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కురుమయ్య హాజరయ్యారు. గ్రామ చౌరస్తా వద్ద రెండు దేవాలయాల పరిసరాలు, చింత చెట్టు కింద ఉన్న చెత్తను శుభ్రపరిచి పరిశుభ్రమైన వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపడుతున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమం భవిత తరాల కోసం ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. శుభ్రతలోనే భక్తి ఉందని భావించే మన సంస్కృతిని గుర్తు చేస్తూ ప్రతి పౌరుడు స్వచ్ఛతను వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలకు రోగాలు దూరమై ఆరోగ్యకరమైన జీవనం సాగుతుందని, పరిశుభ్రత ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హరికృష్ణాచారి, గన్నోజు శ్రీధర్ ఆచారి, బైరమోని నరసింహ, జి.కొండల చారి, శివ నాయక్, గుండె మోని మల్లేష్, హనుమంత్, వంశి చారి, జైపాల్, శ్రీకాంత్, అనిల్, వినోద్, ప్రమోద్, రమేష్, మహేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు వరం



**కేశంపేట సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**
వివిధ రకాల అనారోగ్యా సమస్యలతో ఆస్పత్రిలో చూయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిది వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షురాలు గుండు రాణి అన్నారు. గురువారం కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగుడ గ్రామానికి చెందిన అబ్బి మణెమ్మ, అబ్బి అబ్రహం లకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద విడుదలైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ప్రస్తుతం పేదలకు ఒక వరం అన్నారు, అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సమయంలో ఆర్థిక సాయం, అత్యవసర పరిస్థితుల్లో పేద కుటుంబాలకు భరోసనిస్తుందన్నారు. బాధిత కుటుంబాలకు ఇలాంటి పతకం ప్రవేశ పెట్టి, వారికి ఆసరాగా నిలుస్తున్నందుకు ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి గారికి, మా నియోజకవర్గం ఎం ఎల్ ఏ వీర్లపల్లి శంకర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేవెళ్ల నర్సింలు, మాజీ డిప్యూటీ సర్పంచ్ సుందరయ్య, శేఖర్, శంకర్, ఆంజనేయులు, బిక్షపతి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం : డా.స్వర్ణలత దేవి



**మంచాల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
మంచాల మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు(క్యా సేవ్) ద్వారా అందచేసిన వరి పంట పొలాలను గురువారం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ స్వర్ణలత దేవి సందర్శించారు. వరి పంటలలో వచ్చే చీడపీడలు, వాటి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. పంట కోసిన తర్వాత అదే విత్తనాన్ని తిరిగి వాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారి లింగస్వామి, రైతులు రవీందర్ రెడ్డి, పాండయ్యా, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### మంచాల మండలంలో స్వచ్ఛత హీ సేవ



**మంచాల సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**
మండలంలో గురువారం స్వచ్ఛత హీ సేవ 2025 నిర్వహించారు. మండలంలో గురువారం స్వచ్ఛత హీ సేవ 2025 నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో శ్రమదానం కార్యక్రమంలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలని తొలగించారు. పాఠశాలలలో గ్రామంలోని అన్ని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాలశంకర్, మండల పంచాయతీ అధికారి కె ఉమారాణి, కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛభారత్



**కేశంపేట సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**
సేవ పక్షం కార్యక్రమంలో భాగంగా కేశంపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బిజెపి కేశంపేట మండల అధ్యక్షురాలు రాధిక ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ నాయకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా స్వచ్ఛభారత్ షాద్ నగర్ ఇంచార్జ్ పసుల నరసింహ యాదవ్ హాజరై కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తన పరిసరాల ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ఐలయ్య, మండల కో కన్వీనర్ మహేష్, మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి, జిల్లా సంస్కృతిక కో కన్వీనర్ కరెడ్ల నరేందర్ రెడ్డి, యుగంధర్, జైపాల్ రెడ్డి, తలసాని పవన్ కుమార్ రెడ్డి, పాండురంగారెడ్డి, రమేష్, వీరేందర్ నాయక్, దాసరి మహేష్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

## బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

### ఆర్డీవో రాంమూర్తి

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** రానున్న బతుకమ్మ పండగ నేపథ్యంలో ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆర్డీవో రాంమూర్తి మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలకు ఎలాంటి ఆటంకం జరగకుండా ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు వద్ద శాంతి భద్రతలకు భంగం కలగకుండా చూసుకోవాలని సిఐ కోంద్ర శ్రీనివాస్, ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డిలను ఆదేశించారు. బతుకమ్మ ఆట, పాటలు రాత్రి సమయంలో జరగుతుండడం వల్ల విద్యుత్ శాఖ అధికారులు లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు.

## విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** మనిషి జీవితంలో విద్యార్థి దిశ చాలా ముఖ్యమైనదని ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈవిటీజింగ్, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు, ఈవిటీజింగ్ జోలికి వెల్లకూడదన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ చెన్నూరి గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో మార్పు తీసుకు వచ్చే శక్తిగలవారని, ఆ శక్తిని ప్రతీ విద్యార్థి బయటకు తీయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరునలహరి రణధీర్ ఉన్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు : ఏవో




ఆయిల్‌ఫామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**ములుగు, సెప్టెంబరు 18 (ప్రభాతవార్త):** ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి జి.ప్రగతి అన్నారు. జిల్లాలో ఆయిల్‌ఫామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా గురువారం అలీనగర్ గ్రామానికి చెందిన రైతులు పైళ్ల కృపాల్‌రెడ్డి, పాల్‌రెడ్డిల వ్యవసాయ క్షేత్రంలో 10 ఎకరాలకుగానూ ఎకరానికి 57 మొక్కల చొప్పున 570 మొక్కలను నాటినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ములుగు మండలంలో 223 ఎకరాలలో 45 మంది రైతులు ఆయిల్‌ఫామ్ సాగు చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం 34 ఎకరాలలో సాగు చేయడం జరుగుతుందని చెప్పారు. ఆయిల్‌ఫామ్ సాగును ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్‌పై 80 నుండి 100 శాతం సబ్సిడీ, మొక్కలపై సబ్సిడీ, మెయింటనెన్స్ చార్జీల కింద ఎకరానికి రూ.4,200 చొప్పున సంవత్సరానికి రైతుల ఖాతాలో వేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆయిల్‌ఫామ్ సాగుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ భాగనోళ్ల విజయ మోహన్, ఏఈఓ పృథ్వీ, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతి కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు బాల్‌నర్సయ్య



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

**కొండపాక, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** పంచాయతీ కార్మికులు పండగ పూట ఉపవాసాలు ఉండకుండా పెండింగ్‌నవేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్‌నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వెలిక్ట క్రాస్ రోడ్డువద్ద ఆయన మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ కార్మికులకు మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండడం వల్ల వారు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ, దసరా పండుగలకైన వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి దపురించింద చెల్లించాలని, పల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కార్మికుల వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం ఇచ్చినమాట తప్పడం సరికాదన్నారు. కార్మికులకు సబ్బులు, నూనెలు, చెప్పులు, దుస్తులు ఇతర వస్తువులు ఇవ్వడంలేదన్నారు. కార్మికులందరికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వలని లేని పక్షంలో పనులు నిలిపివేసి ధర్నాలు చేపట్టవలసి వస్తుందని ప్రభుత్వాన్ని అయన హెచ్చరించారు. కార్యక్రమంలో అ సంఘం జిల్లా అధ్యక్షుడు జాలిగామ ప్రభాకర్, బర్మ కొమురయ్య, అరుట్ల నర్సింలు, గొడుగు నారాయణ, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

### సిఐ లతీఫ్, ఎంఇవో సత్యనారాయణ

**రాయపోల్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగాలని తొగుట సిఐ లతీఫ్,రాయపోల్ మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు.గురువారం రాయపోల్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లి మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన వ్యాపారవేత్త గంగి యాదగిరి సొంత నిధులతో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్, షూలు, ఐడి కార్డ్స్, టై బెల్టులను సిఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ మానస,రాయపోల్ ఎంఇవో సత్యనారాయణరెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి తొగుట సిఐ లతీఫ్ రూ. 5 వేలు అందజేసారు. కార్యక్రమంలో రాయపోల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, తిమ్మక్కపల్లి హెచ్ఎం నవీన్, చిన్నమాసన్‌పల్లి హెచ్ఎం శ్రీకాంత్, వెంకటయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ మార్పులను సమిష్టిగా ఎదుర్కొందాం

## భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర




జాతీయ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర

**ములుగు, సెప్టెంబరు 18 (ప్రభాతవార్త):** పర్యావరణ మార్పులను సమిష్టిగా ఎదుర్కోవాలని అప్పుడే మానవాళిని, వ్యవసాయ, ఉద్యాన రంగాలను కాపాడుకోగలమని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర అన్నారు. గురువారం శ్రీకొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం, ఉద్యాన శాఖ, నాబార్డ్, ఎర్త్ సైన్సెస్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సంయుక్తంగా ఉద్యాన రంగంపై పర్యావరణ మార్పుల ప్రభావం అనే అంశంపై ములుగులోని ఉద్యాన విశ్వవిద్యాలయం వేదికగా 18, 19 తేదీలలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు డాక్టర్ మృత్యుంజయమహాపాత్ర ముఖ్య అతిథిగా హాజరై విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర మాట్లాడుతూ ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతాంగంపై పర్యావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. పర్యావరణ మార్పులు కేవలం రైతాంగాన్ని, ప్రజలనే కాకుండా వాతావరణ శాఖను సైతం ఇబ్బంది పెడుతుందని, అందుకు దీటైన వ్యూహాలతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. వాతావరణ అంచనాలు ప్రస్తుతం 40 నుంచి 50 శాతం మాత్రమే ఉన్నాయని, మల్టీ ఫోర్కాస్ట్ మోడల్స్‌తో దీన్ని అధికమిస్తామని ఆయన అన్నారు. మారుమూలాలో ఉన్న చిన్న, సన్నకారు రైతుకు సైతం ఈ మార్పుల ప్రభావం తట్టుకునే తరుణోపాయాలు అందించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. పూర్తిస్థాయి పర్యావరణ మార్పులు ప్రస్తుతం కనిపిస్తున్నాయని అనుగుణంగా సాగులో మార్పులు, తగిన విధానాలు, పంటల ఎంపికలలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్లోబల్‌యాక్షన్, లోకల్ ప్రొడక్షన్ పద్దతిలో పంటల సాగు జరగాలని కోరారు. పర్యావరణ మార్పులు, వాతావరణానికి సంబంధించిన ప్రతి చిన్న అంశాన్ని ఎప్పటికప్పుడు దేశంలోని ప్రతి పౌరునికి అందేలా చూడాలని తెలిపారు. పర్యావరణ మార్పులను తట్టుకొని నాణ్యత, అధిక దిగుబడి ఇచ్చే పంట రకాల వైపు పరిశోధనలు ముమ్మరం చేయాలని, ప్రతి వ్యక్తికి పర్యావరణ మార్పుల్లోని ప్రతి అంశాన్ని అర్థమయ్యేటట్టు అందించే ప్రయత్నం భవిష్యత్తులో జరగాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి, అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్ ఎం.రఘునందన్‌రావు మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన అన్ని పరిశోధనలు, విధానాలు దేశ ఆహార భద్రత కోసమే జరిగాయని, దేశ పోషక భద్రత కోసం అందరు పనిచేయాలని అందుకు తగిన విధివిధానాలు రూపొందించుకోవాలని అన్నారు. ఈ లక్ష్యానికి పర్యావరణ మార్పులు అడ్డుగా ఉన్నాయని, పరిష్కరించే ప్రయత్నాలు చేయాలని కోరారు. వాతావరణ శాఖ, సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తలు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ ఉద్యానరంగంపై పర్యావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు అవకాశం ఉన్న ప్రతి సాంకేతిక, పరిశోధన అంశాన్ని రైతులకు చేరవేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వం ఉద్యాన శాఖ, విశ్వవిద్యాలయం కలిసి రైతులకు ఎప్పటికప్పుడు చేదోడు వాదోడుగా ఉండి పర్యావరణ మార్పుల ప్రభావాన్ని జయిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నిపుణులు రూపొందించిన ఇంట్రడక్టరీ అగ్రికల్చర్ మెటీరియాలజీ అనే టెక్స్ట్ బుక్‌ను, బుక్ఆఫ్ అబ్స్ట్రాక్ట్‌ను ప్రముఖులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఉదయభాస్కర్, బోర్లాగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సౌత్ ఏషియా రీజనల్ ప్రోగ్రాం లీడర్ డాక్టర్ ప్రమోద్ కుమార్ అగర్వాల్, వర్సిటీరిజిస్టర్ డాక్టర్ భగవాన్, ప్రముఖ వాతావరణ శాఖ, ఉద్యాన నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మహాత్మ జ్యోతిబాపూలే విద్యార్థులు

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**దుబ్బాక, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** హబ్సిపూర్‌లోని మహాత్మ జ్యోతి బాపూలే బాలుర పాఠశాల పదవ తరగతి విద్యార్థులు కిరణ్, భవదీష్ రాష్ట్ర స్థాయి కబడ్డీ అసోసియేషన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ రెడ్డి గురువారం ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో జరిగే 35వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన కిరణ్, భవదీష్ విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

## సంగారెడ్డిలో ప్రపంచ వెదురు దినోత్సవం




వెదురు ఉత్పత్తుల ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో గురువారం నిర్వహించిన వెదురు ఉత్పత్తుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమం లో పాల్గొన్న స్థానిక మాజీ మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయ లక్ష్మి రవి మాట్లాడుతూ మేదరులు ఐక్యంగా ఉండి సంఘం సమస్యలు పరిష్కారం కొరకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమం లో బి సి సంక్షేమ సంఘం.అధ్యక్షులు చిద్రుప్పా ప్రభుగౌడ్, బహుజన నాయకులు మల్లయ్య, రజక సంఘాల సమితి అధ్యక్షులు నామాల నాగేష్, బి సి సంక్షేమ సంఘం నాయకులు మల్లికార్జున్ పాటిల్, ఫోరమ్ ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్. లు పాల్గొన్నారు అనంతరం మేదరి మహేంద్ర సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు అంబాదాస్, శ్రీధర్ మహేంద్ర ల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం లో డిమాండ్ లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

## ఉపాధ్యాయులకు తరగని ఆస్తి విద్యార్థులే : డిఇవో

**చిన్నకోడూరు, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** ఉపాధ్యాయులకు ఉద్యోగ జీవితంలో తరగని ఆస్తి విద్యార్థులేనని జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ షరీఫ్ ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశంలో ఆయన గురువారం పాల్గొని మాట్లాడారు. అబ్దుల్లా షరీఫ్ ఉద్యోగ జీవితంలో విద్యాప్రమాణాలు పెంచేందుకు కృషి చేశారని తెలిపారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ వేలేటీ రోజాశర్మ, టిఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఆశ్వాక్ అహ్మద్ మాట్లాడారు. కార్యక్రమంలో పిఆర్ డిఈ బ్రహ్మం, ఎంఈవో సత్తు యాదవరెడ్డి, తిరుపతి, గెజిటెడ్ హెచ్ఎం లక్ష్మయ్య, సత్తవ్వ, షౌకల్ అలీ, సముద్రాల శ్రీనివాస్, గుండా వేణుగోపాల్, గౌసోద్దీన్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పద్మారెడ్డి, ఉపాధ్యాయులు వరప్రసాద్, యాదయ్య, సునీత, నాగమణి, అబేదాబేగం, వాణి, స్వరూప, రామిని భాస్కర్, గంగాభవాని,కత్తి మల్లయ్య, నరేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న బిజెపి నాయకులు

## బిజెపి ఆధ్వర్యంలో 'స్వచ్ఛ భారత్'

**నర్సాపూర్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ 75 పుట్టినరోజు పురస్కరించుకొని సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో, ప్రభుత్వ కళాశాల వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు వాల్ దాస్ రాధా మల్లేష్‌గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళియాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొనగా బిజెపి నాయకులతో కలిసి ఆవరణలో చెత్త చెదారాలు లేకుండా పరిశుభ్రం చేశారు. పరిసరాలన్ని పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలకు ఎలాంటి అనారోగ్యాలు దరి చేరవని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్‌తో పాటు మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు పాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్, రాష్ట్ర నాయకులు పెద్ద రమేష్ గౌడ్, కౌన్సిలర్స్ గోడ రాజేందర్, యాదగిరి, లతా రమేష్ యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గున్నడ శంకర్, జిల్లాకోశాధికారి ఆంజనేయులు గౌడ్, మహిళా మోర్చా నాయకురాలు కవిత రెడ్డి, మండల అధ్యక్షుడు నీలి నాగేష్, పట్టణ అధ్యక్షులు చంద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు డ్రై రేషన్ కిట్లు పంపిణీ

**హవేళీఘనపూర్, సెప్టెంబరు 18,ప్రభాతవార్త:**

సమాజ మద్దతును హృదయపూర్వకంగా ప్రదర్శిస్తూ, విశ్వప్రగామి ట్రస్ట్ ఈరోజు మెదక్ లోవరద బాధిత 200 కుటుంబాలకు డ్రై రేషన్ కిట్లను పంపిణీ చేసింది. ఇటీవలి వరదల తర్వాత వచ్చిన సవాలుతో, ఈ కష్ట సమయంలో వారికి సహాయపడటానికి నిత్యవసర సరుకులు అందించారు. డ్రై రేషన్ కిట్లలో బియ్యం, పప్పులు మరియు ఇతర ప్రధాన వస్తువులతో సహా చెడిపోని ఆహార పదార్థాల జాగ్రత్తగా ఎంపిక చేయబడినవి ఉన్నాయి. ఈ కిట్లు బాధిత కుటుంబాల ప్రాథమిక అవసరాలను తీర్చడంలో చాలా సహాయపడతాయి, ఈ క్లిష్ట కాలంలో వారికి ఉపశమనం మరియు ఓదార్పు నిస్వాయి అని విశ్వప్రగామి ట్రస్ట్ సంస్థ ఏరియా మేనేజర్ మోజెస్ మరియు సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ రవి గారు అన్నారు, విశ్వప్రగామి ట్రస్ట్ వరదల తర్వాత సమాజానికి మద్దతు ఇవ్వడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోంది. బాధిత వారికి ఉపశమనం మరియు సహాయం అందించడానికి వారి విస్తృత ప్రయత్నాలలో డ్రై రేషన్ కిట్ల పంపిణీ భాగం. రేషన్ కిట్లను పొందిన వారు విశ్వప్రగామి ట్రస్ట్ వారి దయ మరియు దాతృత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ప్రయత్నాలు సమాజానికి ఆశ మరియు భరోసాను తెచ్చిపెట్టాయి మరియు అవసరమైన వారికి మద్దతు ఇవ్వడంలో వారి నిబద్ధత ప్రశంసనీయం. వరద బాధిత కుటుంబాలకు అవసరమైన సామాగ్రిని అందించడం ద్వారా, విశ్వప్రగామి ట్రస్ట్ సమాజం ఎదుర్కొంటున్న కొన్ని తక్షణ సవాళ్లను తగ్గించడంలో సహాయపడుతుంది. వారి నిస్వార్థ పని అవసరమైన సమయాల్లో కరుణ మరియు దయ యొక్క శక్తికి నిదర్శనం. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రదీప్, సుధీర్, రాజా చంద్ర మరియు స్థానికంగా నివాసముంటున్న వినయ్ పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

## సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**బెజ్జంకి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశమున్నందున ప్రజలకు అవగాహన కల్పించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. గురువారం మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఓపి, రికార్డులను తనిఖీ చేశారు. ఓపి, ఫార్మా సంఖ్యతో సమానంగా ఉండాలని వైద్యాధికారి కృష్ణ తేజకు సూచించారు. అలాగే డెంగ్యూ, మలేరియా, ఎనిమియా కేసులపై ఆరాతీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల ఓపికతో వైద్యం అందించాలన్నారు. అదే గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఇందిరమన్మ ఇళ్ల మంజూరులో పైలెట్ గ్రామమైన వీరాపూర్ గ్రామంలో లబ్దిదారులైన గాండ్ల మల్లవ్వ, లక్ష్మయ్య ఇంటిని పరిశీలించి ఇంటి లోపల,బయట నిర్మాణం బాగుందని..ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలని సూచించారు. మంచి రోజు చూసుకొని గృహ ప్రవేశానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడివో ప్రవీణ్, వైద్యాధికారి కృష్ణతేజ, పంచాయతీ కార్యదర్శి బాబు పాల్గొన్నారు.




ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి



సమావేశంలో పాల్గొన్న గిరిజన నాయకులు

## లంబాడీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** లంబాడీల సమస్యల పరిష్కారం కోసం నేడు (శుక్రవారం) హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో నిర్వహించే ఆత్మగౌరవసభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుండి లంబాడీ, గిరిజనులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని గిరిజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం రోజున పట్టణ కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్‌టి జాబితా నుండి లంబాడీలను తొలగించాలని కొంత మంది కావలనే ప్రయత్నాలు చేస్తున్నారని అలా జరిగితే గిరిజనుల ఆగ్రహం చూస్తారని హెచ్చరించారు. గిరిజనుల పై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ ఆత్మగౌరవ సభ ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సభతో గిరిజనుల ఐక్యతను పాలక ప్రభుత్వాలకు చూపించాలన్నారు. ఈ సభకు నియోజకవర్గ వ్యాప్తంగా వెయ్యి మందితో ప్రత్యేక వాహనాల ద్వార తరలి వెల్లనున్నట్లు వారు వివరించారు. సమావేశంలో గిరిజన నాయకులు మాలోతు భీలు నాయక్, భూక్య శ్రీనివాస్‌నాయక్, రాజునాయక్, లక్ష్మణ్‌నాయక్, రాములు, భూక్య సరోజన, తిరుపతి నాయక్, సత్యంనాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## కడవేర్గులో స్వచ్ఛ భారత్

**చేర్యాల, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** ప్రధాన మంత్రి నరేంద్ర మోది జన్మదినం సందర్భంగా ఈనెల 17 నుండి అక్టోబర్ 2వరకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని బిజెపి జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి తెలిపారు. గురువారం మండలంలోని కడవేర్గు గ్రామంలో మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు ఆధ్వర్యంలో సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని శివాలయం వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఉమారాణి మాట్లాడుతూ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడి 11ఏళ్ళలో చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బూరుగు సురేష్‌గౌడ్, మచ్చంతుల సిద్దారెడ్డి, మడికొండ శ్రీనివాస్, కుర్రారం బాలర్సయ్య, బయ్యారపు యాదగిరి, వెలుగల వినయ్,బాల్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

**చేర్యాల, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** చేర్యాల మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డుకు చెందిన కర్రోళ్ళ సంజీవులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం కొమురవెల్లి దేవస్థానం కమిటీ మాజీ మెంబర్, మాజీ వార్డు సభ్యులు పచ్చిమడ్ల సిద్దిరాములు వారి కుటుంబాన్ని పరామర్శించి 25కిలోల బియ్యాన్ని అందించారు. ఆయనతో రామగళ్ల జూకయ్య, భూమిగారి శ్రీరామ్,ప్రేమ్ కుమార్, శేఖర్, కర్రోళ్ళ చిన్న,కిషోర్, శ్రీను, భూమిగారి బిక్షపతి,ముస్త్యాల మధు,సామెల్,అఖిల్ తదితరులు ఉన్నారు.

## పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 18 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరంలో కార్మికులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, ఆర్ఐ, సానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

**మర్కుక్, సెప్టెంబరు 18 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన పిట్ల యాదయ్య ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా పెద్దమొత్తంలో ఖర్చు కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.60వేల చెక్కును మర్కుక్ మండల తాజా మాజీ ఎంపిపి పాండుగౌడ్ గురువారం పిట్ల యాదయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా పాండుగౌడ్ మాట్లాడుతూ పేదలు వైద్యం కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తే అందులో కొంత ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పొందవచ్చని, ముఖ్యమంత్రి సహాయనిధిని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనుల్ని వేగవంతం చేయండి

### మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్



ఇళ్ల కొలతల్ని సేకరిస్తున్న దృశ్యం

**దుబ్బాక, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ అన్నారు. గురువారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి 5 వ వార్డులో లబ్ధిదారులు చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్ని హౌసింగ్ ఏఈ జాహ్నవి తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతిత్వరలోనే గృహప్రవేశాలకు ఏర్పాట్లు సిద్ధం చేసేలా పనుల్ని పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల కొలతల్ని సేకరించారు. వారి వెంట వార్డు ఆఫీసర్లు మహేష్, నవీన్, చంద్రయ్య ఉన్నారు.

## రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకోం

### బిసివైపి నేత గాదగోని చక్రధర్‌గౌడ్

**చిన్నకోడూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు మేనేజర్‌తో పాటు సిబ్బంది రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని భారత చైతన్య యువజన పార్టీ(బిసివైపి) రాష్ట్ర నాయకులు గాదగోని చక్రధర్‌గౌడ్ అన్నారు. గురువారం చిన్నకోడూరు యూనిన్ బ్యాంకులో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బిసివై పార్టీ రాష్ట్ర నాయకులు గాదగోని చక్రదర్‌గౌడ్‌కు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన చిన్నకోడూరు యూనియన్ బ్యాంక్‌ను సందర్శించి మేనేజర్‌తో రైతుల సమస్యలపై మాట్లాడి నిలదీశారు. రైతులు తీసుకున్న పంట రుణం అసలు, మిత్తిడబ్బులు కట్టాలంటు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. యూనిన్ బ్యాంక్‌లో రైతులు పంట రుణాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.బ్యాంకు సిబ్బందితో కొంత మంది దళారులు చేతులు కలిపి రైతులను వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా బ్యాంక్ మేనేజర్‌తో పాటు సిబ్బంది తమ తీరును మార్చుకోవాలన్నారు. రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేసిన రైతులకు అండగా నిలిచి పోరాటం చేస్తామన్నారు. దీంతో చేసేదేమిలేక బ్యాంకు సిబ్బంది ఇక నుంచి రైతులను ఇబ్బందులకు గురి చేయమని చెప్పారు.కార్యక్రమంలో బీసీవై పార్టీ నాయకులు బొలుగం శ్రీకాంత్‌గౌడ్, నాగరాజు,శ్రవణ్, తిరుపతి, ప్రశాంత్, నర్సింహ్మారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో కలిసి మాట్లాడుతున్న బిసివై పార్టీ నాయకులు చక్రధర్‌గౌడ్

## నేడు పంచలింగేశ్వర ఆలయంలో అభిషేకాలు

**మనూర్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
ఈ నెల20వ తారీఖున మండల పరిధిలోని బాల్‌గాంవ్‌లో కొలువుంది భక్తులచే నిత్యపూజలందుకుంటున్న శ్రీపంచలింగేశ్వర ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ బాధ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20న సాయంత్రం 6గంటలకు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ షెట్కార్ సోదరుడు జితేందర్‌షెట్కార్ తనధర్మపత్ని నారాయణఖేడ్ మాజీ జడ్పిటిసి సభ్యురాలు సంగీతషెట్కార్, కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో అభిషేకం, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు సంగీతజితేందర్‌షెట్కార్‌ల సహకారంతో ప్రసాదవితరణ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పూజాకార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించి పంచలింగేశ్వరస్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయకమిటీ బాధ్యులు వినతిచేశారు.

## రాయిపల్లిలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం



రాయిపల్లిలో మొక్కలు నాటుతున్న దృశ్యం

**మనూర్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రాయిపల్లి గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శి, యూత్ ఫర్ హ్యూమానిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా హై కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులతో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా హరితహారంలోభాగంగా 2వందల మొక్కలు నాటారు. వారంరోజుల పాటు గ్రామంలో గ్రామస్థుల సహకారంతో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి గ్రామాన్ని పరిశుభ్రంగా చేస్తామన్నారు. యువత గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందించాల్సి ఉంటుందని, యువతతో గ్రామం అభివృద్ధిచెందడం తథ్యమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కళావతి, ఉపాధ్యాయులు, యూత్ ఫర్ హ్యూమానిటీ ఉపాధ్యక్షులు అమీర్, అజర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల అభివృద్ధికి ప్రభుత్వాలు పనిచేయాలి

**కొల్చారం, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో దళితులు ఆర్థికంగా, రాజకీయంగా అత్యంత వెనుకబడి ఉన్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా యువసేన నాయకులు పుర్ర మహేష్‌మాదిగ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితుల అభివృద్ధికై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడిపనిచేయాలన్నారు. స్వాతంత్ర్య వచ్చి 79సంవత్సరాలు అయినప్పటికీ, కొల్చారంమండలలో ఇప్పటివరకు, జడ్పిటిసి ఎంపిపి పదవికి దళితులు నోచుకోలేదన్నారు. ఈసారి వచ్చే ఎన్నికల నోటిఫికేషన్లో ఎస్సీ రిజర్వేషన్లు కల్పిస్తూ జడ్పిటిసి, ఎంపిపి, పదవులు దళితులకు వచ్చేవిధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, అసైన్మెంట్ భూములకు సంపూర్ణ పట్టాలు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫుట్వేర్ డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఇండస్ట్రీ ద్వారా దళితుల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. పక్కరాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక వేలాదికోట్ల రూపాయల తోలు, పాదరక్షలు ఎగుమతుల ద్వారా రాష్ట్రప్రభుత్వాలు ఆదాయం ఆర్జిస్తున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్టడుగు వర్గాల ప్రజలకు సంబంధించిన విద్యార్థులకు నాణ్యమైనవిద్య, అందించాలని డిమాండ్ చేశారు.

## రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయకపోవడం బాధాకరం

**సదాశివపేట, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయకపోవడం బాధాకరం అని తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దొడ్ల వెంకట్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో రెండులక్షలలోపు రుణమాఫీ ప్రతి ఒక్కరికీ చేస్తామని ఇప్పటి వరకు చేయలేదన్నారు. రాష్ట్రంలో ఐదులక్షల మంది రైతులకు ఇంకా రుణ మాఫీ కాలేదనీ ఆయన అన్నారు. రాబోయే శాసనసభ సమావేశాల్లో ప్రతిపక్షపార్టీలు బిఆర్ఎస్, బిజెపిలు రైతురుణమాఫీ గురించి మాట్లాడాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తామన్న రుణమాఫీ వెంటనే చేసి రైతులందరికీ సరిపడా ఎరువులు అందజేయాలని, రైతుపక్షాన ఆలోచన చెయ్యాలని ఆయన అన్నారు.

## నాగల్‌గిద్దలో లైట్లు ఏర్పాటు చేయాలి

**-ఎంపిడిఓతో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గణపతి**



ఎంపిడిఓకు వినతిపత్రం అందిస్తున్న గణపతి

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో వీధిదీపాలు ఏర్పాటుచేయాలని కెవిపిఎస్ జిల్లా సహాయకార్యదర్శి గణపతి డిమాండ్‌చేశారు. గురువారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓకు గణపతి వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా గణపతి మాట్లాడుతూ గ్రామంలో గత కొన్ని రోజులుగా వీధిదీపాలు వెలగక ప్రజల అవస్థలు పడుతున్నారన్నారు. దసరాపండగ సమయాల్లో ఇతరగ్రామాల నుంచి ప్రజలు స్వగ్రామానికి వస్తూ ఉంటారని, పండగను పురస్కరించుకుని పనులు చేసుకునేందుకు రాత్రిళ్లు ఆరుబయటకు రావాల్సి ఉంటుందని, వీధిదీపాలు లేకుంటే ప్రజలు పాట్లుపడాల్సివస్తుందని, అందుకు అధికారులు వెంటనే స్పందించి వీధిదీపాలన్నీ వెలిగేలా చర్యలు తీసుకోవాలని గణపతి సూచించారు. గ్రామపంచాయతీ కార్మికులకు బకాయిపడ్డ జీతాలను వెంటనే చెల్లించాలని గణపతి డిమాండ్‌చేశారు.

## నూతన రేషన్ కార్డులు అందజేత

**నిజాంపేట్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
నిజాంపేట్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలందరికీ ఇచ్చామని తెలియజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు శంకర్ లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. తెల్ల రేషన్ కార్డు వల్ల పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపి సురేష్‌షెట్కార్‌లకు గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ పేదలకు అండ

**-మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్‌యాదవ్**

**చిన్నకోడూరు, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
కాంగ్రెస్‌పార్టీ పేదలకు అండగా నిలుస్తుందని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్‌యాదవ్ అన్నారు. మండలపరిధిలోని ఎల్లాయిపల్లి మదిర కాసారంపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కాసారం విఠల్‌రెడ్డి కుటుంబాన్ని గురువారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం అందజేసి ఆయన మాట్లాడారు. అపదలో ఉన్న బాధితకుటుంబాలను ఆదుకోవడానికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లవేళలా ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సందబోయిన పర్శరాం, పొన్నాల రాజేష్, ఉడుతా జయంత్, ఉడుతా ప్రశాంత్, గొట్టిపర్తి చంద్, మీసం రాకేష్, మీసం శేషు, ఉడుతా వేణు, మహేందర్, కొలిపాక మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ

**-అట్టహాసంగా ప్రారంభమైన జిల్లా కబడ్డీ క్రీడలు**
**-క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించిన ఎంపి షెట్కార్**



క్రీడాకారులతో కబడ్డీ కూత పెడుతూ పోటీలను ఆరంభిస్తున్న ఎంపి సురేష్‌కుమార్‌షెట్కార్

**జహీరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని ఎంపి సురేష్ కుమార్‌షెట్కార్ అన్నారు. రెండురోజుల పాటు (గురువారం, శుక్రవారం) జరిగే క్రీడాపోటీలను జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్ క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడాకారులకు ఆల్ ద బెస్ట్ చెప్పి క్రీడలను ప్రారంభించారు. టౌర్నమెంట్‌లో జిల్లాలోని 22మండలాల నుంచి 12వందలమంది క్రీడాకారులు (మండలస్థాయి విజేతలు) పాల్గొని ప్రత్యర్థ క్రీడాకారులతో పోటీలకు తలపడబోతున్నారు. ఆయా పాఠశాలల క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తూ ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్‌కు గౌరవ వందనం చేశారు. గురువారం మండలంలోని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీలను ఎంపి సురేష్‌కుమార్‌షెట్కార్ ప్రారంభించి ప్రసంగించారు. దేశంలో 150కోట్ల జనాభా ఉన్న ఒలింపిక్స్ క్రీడల్లో ఫలితాలు సాధించకపోవడంతో దేశ ప్రజలకు కలిగిన బాధను తొలగించేందుకు తెలంగాణ రాష్ట్రంలో క్రీడాకారులను ఒలింపిక్స్ క్రీడలో పథకాలు సాధించే విధంగా తయారు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తను సైతం చదువుకునే రోజుల్లో కబడ్డీ క్రీడపై ఎంతో ఆసక్తిగా ఆడేవాడినని గుర్తు చేసుకున్నారు. క్రీడాకారులు క్రీడలను క్రీడాస్ఫూర్తితో ఆడాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.సుభాష్‌రావు, ఆత్మకమిటీ చైర్మన్ పి.రామలింగారెడ్డి, టెలికం బోర్డు సభ్యులు వైద్యనాథ్, జమీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, మండలాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పి.నరసింహారెడ్డి, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతరావు పాటిల్, పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నరేష్‌గౌడ్, కాంగ్రెస్‌నాయకులు శుక్లవర్ధన్‌రెడ్డి, జిల్లా ఎస్‌జిఎఫ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, ఆయా మండలాల పిఈటిలు, విద్యార్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జిని సందర్శించిన ఎంపి



రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎంపి సురేష్‌కుమార్‌షెట్కార్

**జహీరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
మండలంలోని రంజోల్ నుంచి బాబనగర్‌కు వెళ్లే మార్గంలో రైల్వే అండర్ ట్రాక్ వద్ద నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని గురువారం ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్ సందర్శించారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షంపడితే నీరు కిందకు పోకుండా అక్కడే నిలుస్తుండటంతో బాబనగర్, హుగ్గెల్లితండా తదితర గ్రామాల ప్రజలకు, విద్యార్థులకు రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్నాయని తెలుసుకుని పరిస్థితిని పరిశీలించారు. సమస్య పరిష్కారానికి వెంటనే సెంట్రల్ రైల్వే అధికారుల దృష్టికి తీసుకుపోయి ప్రత్యామ్నాయంగా దారి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో రామాయంపేటలో స్వచ్ఛభారత్

**-పేరుకుపోయిన చెత్తను తొలగించిన కార్యకర్తలు**



చెత్తను తొలగిస్తున్న బిజెపి కార్యకర్తలు

**రామాయంపేట, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
బిజెపి పిలుపు మేరకు ఓబిసి రామాయంపేట పట్టణశాఖ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని ఎంపిడిఓ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్నటువంటి ప్రైమరీస్కూల్ వద్ద గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. బిజెపి ఓబిసి పట్టణ అధ్యక్షులు దువ్వెనపల్లి నాగరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ హాజరయ్యారు. తమ పార్టీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించి పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్య దర్శి చిన్నమైన శ్రీనివాస్, ఓబిసి జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, ఓబిసి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చింతల శేఖర్, బిజెపి పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, వెలుముల సిద్ధరాములు బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్‌గౌడ్, జొన్నల భరత్, దువ్వెనపల్లి పల్లి సందీప్, బాసమ్ అనిల్, దయానందరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు ఆందోళన చెందవద్దు

**-మండల వ్యవసాయాధికారిణి లక్ష్మీప్రవీణ్**

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
యూరియాగురించి రైతులు ఆందోళనచెందవద్దని మండల వ్యవసాయాధికారిణి లక్ష్మీప్రవీణ్ తెలిపారు. గురువారం చిన్నశంకరంపేటలోని సహకార సంఘంలో రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు వచ్చిన యూరియా నిల్వలపై ఆరాతీశారు. మండలంలోని నాలుగు సహకారసంఘాలకు మరో రెండురోజుల్లో యూరియానిల్వలు వస్తాయని తెలిపారు. రైతులు నానోయూరియాను పిచికారీచేయాలని రైతులకు సూచించారు.

## నాగల్‌గిద్ద పాఠశాలలలో స్వచ్ఛ భారత్



పాఠశాల ఆవరణలో స్వచ్ఛ్ భారత్ నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన నాగల్‌గిద్దలోని ప్రభుత్వపాఠశాల ఆవరణలో, గ్రామంలోని అంబేద్కర్, మహాత్మా బసవేశ్వరుడి విగ్రహాల పరిసరాల్లో గురువారం బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి పరిశుభ్రంచేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి అరుణ్‌రాజ్ శేరికర్, మండల బిజెపి అధ్యక్షులు రాజశేఖర్ పాటిల్, బిజెవైఎం మండల అధ్యక్షులు రమేష్, నాయకులు నాగశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ

**-అడిషనల్ ఎస్పీ మహేందర్**




మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ మహేందర్

**కొల్చారం, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థులలో క్రమశిక్షణతోపాటు జాతీయతాభావం అలవడుతుందని మెదక్ జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్ అన్నారు. కొల్చారం మండలం పోతంశెట్టిపల్లిలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఏడు రోజుల శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వల్ల శ్రమ పట్ల అవగాహన, నాయకత్వలక్షణాలు, సమాజసేవపట్ల అవగాహన కలుగుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు చేయవలిసిన ప్రణాళికలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హుసేన్, ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్లు, నాగేందర్, గ్రామపెద్దలు గౌరిశంకర్, రాజేష్, దుర్గాప్రసాద్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి డిపోలో యాత్రదానం పోస్టర్ ఆవిష్కరణ

**జహీరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
భక్తుల ఆధ్యాత్మిక యాత్రలకు మద్దతుగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రారంభించిన యాత్రదానం బస్సులను అందుబాటులోకి తెచ్చింది. యాత్రదానం బస్సులు పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు, వైజ్ఞానికయాత్రలకు వెళ్లే అభాగ్యులు, వృద్ధులు, అనాథల కొరకు దాతలు, స్వచ్ఛందసంస్థలు, కార్పొరేట్ సంస్థలు సహకారంతో ఆర్టీసిబస్సు సౌకర్యం కల్పిస్తుందని ఆర్టీడి డిపో మేనేజర్ టి.స్వామి తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్టీసి డిపోలో డిపో మేనేజర్ టి.స్వామి పట్టణ సిఐ శివలింగంతో కలిసి యాత్రదానం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిఐ శివలింగం మాట్లాడుతూ యాత్రదానంకు దాతలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. డిపో మేనేజర్ టి.స్వామి మాట్లాడుతూ యాత్రదానం మానవత్వపు బహుమతి అని ఆర్టీసి ఎండి సజ్జనార్ వినూత్న కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్‌మేనేజర్ ప్రవీణ్‌కుమార్, డిపో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# పుల్‌కల్ పోలీసుస్టేషన్ సందర్శించిన ఎస్‌పి

**-ఠాణా ఆవరణలో మొక్కలు నాటిన ఎస్‌పి**
**-ఠాణాలో రికార్డులు, జాతీయ రహదారి పరిశీలన**



శివంపేట వద్ద జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎస్‌పి పరితోష్‌పంకజ్

**పుల్‌కల్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం జిల్లా ఎస్‌పి పరితోష్‌పంకజ్ పుల్‌కల్ పోలీసుఠాణాను సందర్శించారు. ఠాణా ఆవరణలో డిఎస్‌పితో కలిసి మొక్కలు నాటారు. ఠాణా పరిసరాలను పరిశీలించి ఠాణా అధికారిని, సిబ్బందిని అభినందించారు. పట్టుబడ్డ వాహనాల వివరాలను ఎస్‌పి అడిగి తెలుసుకున్నారు. ఠాణాకు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా మసులుకోవాలని సూచించారు. అనుమానిత వ్యక్తులను పాపిలోన్ డివైస్‌ను వినియోగించి, వేలిముద్రలను చెక్ చేస్తూ పాత నేరస్థులను గుర్తించాలన్నారు. పెండింగ్ రికార్డులు లేకుండా చూసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణపై పాఠశాల, కళాశాలల, పని ప్రదేశాల్లో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. అంకిత భావంతో విధులు నిర్వాహించి ప్రజల అభిమానం అందుకోవాలన్నారు. పోలీసు ఠాణా పరిధిలోని జాతీయ రహదారిని పరిశీలించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి సత్తయ్యగౌడ్, జోగిపేట సిఐ అనిల్, ఎస్ఐ విశ్వజన్ తదితరులున్నారు.

## రాష్ట్ర కరాటే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా శంకర్

**సదాశివపేట, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
రాష్ట్ర కరాటే బోర్డ్ డైరెక్టర్‌గా సదాశివపేటకు చెందిన కనిగిరి శంకర్ నియమితులయ్యారు. గరువారం ఆయనను పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్ 1987లో కరాటేలో ప్రవేశించడం జరిగిందన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ఎంతోమంది విద్యార్థులకు శిక్షణ ఇస్తూ నేషనల్ కరాటేపోటీలలో పాల్గొనేలా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో గంట శివయ్య, తుమ్మలపల్లి పృథ్వీరాజ్, పులుమామిడి వీరేశం, గందిగే రాజు, రవీందర్, సంగమేశ్వర్, నర్సింగ్, విట్టల్, వెంకట్రావు, దయానంద్, ప్రమోద్, రజనీకాంత్, మహేష్ మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన మహారాష్ట్ర అధికారులు

**కంది, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చేర్యాల గ్రామ పంచాయతీని మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా అధికారులు సందర్శించి ఉపాధిహామీలో చేపడుతున్న పనులను పరిశీలించారు. గ్రామంలో సిసిరోడ్లు, స్మశానవాటికనిర్మాణం, స్కూల్ కాంపౌండ్‌వాల్ నిర్మాణం, కిచెన్‌షెడ్ నిర్మాణం, బాయ్స్, గర్ల్స్ మూత్రశాలల నిర్మాణాలను, బృహత్‌పల్లి ప్రకృతివనం పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. సోలాపూర్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌ల ఆదేశాల మేరకు అసిస్టెంట్ పిడి పూజ, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్, డిప్యూటీ ఇంజనీర్, పంచాయతీరాజ్ ఎఈ, ఎంపిడిఓ, ఎంపిఓ, ఈసి, టిఎలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

**రామాయంపేట, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
గ్రామపంచాయతీ కార్మికుడు నర్సింలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు నర్సింలు గురువారం విధుల్లో భాగంగా గ్రామపంచాయతీ బోరు రిపేర్‌చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందాడు. నర్సింలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల ప్రాణాలతో చెలగాటమడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎంపిడిఓ కార్యాలయంముందు సిఐటియు కార్మికులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు ప్రమాదబీమా వర్తింపచేయాలి

**-కరెంట్‌షాక్‌తో గాయపడ్డ నాగధర్ గ్రామపంచాయతీ కార్మికురాలు**




వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

**నారాయణఖేడ్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
నిజాంపేట్ మండలం నాగధర్ గ్రామపంచాయతీ కార్మికురాలికు గాయం తగ్గేవరకు జీతం ఇవ్వాలని కార్మికులకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని గాయాలైన కార్మికురాలిని సిఐటియు నాయకులు రమేష్ సతీష్‌లు పరామర్శించి డిఎల్‌పిఓకు సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించడం జరిగింది. ఈసందర్భంగా సిఐటియు డివిజన్ ఏరియా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ నిజాంపేట్ మండలం నాగధర్ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న జిపి కార్మికురాలు బాలవ్వ గ్రామంలో ఉదయం సమయంలో ఊరు శుభ్రం చేస్తుండగా 11కెవి వైరు, స్తంభం నుండి తెగిపోయి కార్మికురాలి చేతిపై పడడంతో గాయాలపాలయింది. కార్మికురాలికి కుటుంబం, పిల్లలు ఉండడంతో కుటుంబం ఎలా గడుస్తుందో అంటూ ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి కార్మికురాలికి గాయం తగ్గేవరకు గ్రామపంచాయతీ నుండే జీతం ఇవ్వాలని అలాగే మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించాలని అన్నారు. చిన్నజీతంకాబట్టి వారికి గ్రామపంచాయతీనుండి ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, జీతంతో సంబంధంలేకుండా ప్రభుత్వం ఈఎస్ఐ సౌకర్యం కల్పించేవిధంగా జివో తీసుకురావాలని అన్నారు. అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేసేవిధంగా ప్రమాదబీమా పథకం అమలుచేసేందుకు కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సతీష్, రవికుమార్ ఉన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లకి శిక్షణ తరగతులు

**-అంగన్‌వాడీ సూపర్వైజర్ ప్రమీలప్రశాంతి**



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ ప్రమీలప్రశాంతి

**నారాయణఖేడ్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
పోషణ్ పక్వాడి కార్యక్రమంలో భాగంగా మూడురోజులపాటు నారాయణఖేడ్ ప్రాజెక్టు పరిధిలో శిక్షణ తరగతులను నిర్వహించుకోవడం జరిగిందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీలప్రశాంతి అన్నారు. గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేకశ్రద్ధ వహించాలని తెలియజేశారు. యాప్స్‌పైన కూడా మూడురోజులపాటు ట్రైనింగ్ ఎగ్జామ్స్ కూడా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి



మల్లుపల్లి పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో, ఎంపిడివో

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైనభోజనం అందించాలని మండల విద్యాధికారిణి పుష్పవేణి తెలిపారు. గురువారం మండలపరిధి మల్లుపల్లిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణ, బాత్రూంలు, తరగతిగదులు, త్రాగునీటిని ఎంపిడివో దామోదర్‌తో కలిసి పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు.